🌐 : www.aknu.edu.in
✉ : nannayavani@aknu.edu.in
▶ : nannayanewstv
f : Adikavi Nannaya University
☎ : 9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్


Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 3 | సంచిక : 12 | 19-12-2022 | పుటలు : 4




## ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించండి

**9.12.22 (మీడియాసెల్)**

ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించాలని, నన్నయ విశ్వవిద్యాలయాన్ని గోదావరి జిల్లాల క్రీడాకేంద్రంగా తీర్చిదిద్దాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. శుక్రవారం యూనివర్సిటీ ఈసీ హాల్ లో స్పోర్ట్స్ బోర్డ్ వార్షిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో 2021-22 విద్యాసంవత్సరంలో జాతీయ స్థాయి క్రీడాపోటీలలో ప్రతిభకనపరచిన విద్యార్థులను అభినందించారు. ఏడాది కాలంలో నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో జరిగిన క్రీడాకార్యక్రమాలను, అభివృద్ధిపై చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్పోర్ట్స్ బోర్డు చైర్మన్ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని ఉమ్మడి గోదావరి జిల్లాల క్రీడాకేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. భారతప్రభుత్వం నుండి నన్నయ విశ్వవిద్యాలయానికి ఖేలో ఇండియా నిధులు తీసుకువచ్చామని చెప్పారు. విశ్వవిద్యాలయంలోని క్రీడాభివృద్ధికి సంబంధించి మైదానాలను, వసతులను మెరుగుపరిచామన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం ద్వారా ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని ప్రతిభవంతులైన క్రీడాకారులను ప్రోత్సహించాలని అన్నారు. అర్హత, ప్రతిభ ఉన్నవారికే అవకాశాలను కల్పించాలని సభ్యులను సూచించారు. తరువాత క్రీడా బడ్జెట్ విధివిధానాలను, వార్షిక ఎజెండాలపై చర్చించి క్రీడాభివృద్ధికి సంబంధించి పలు నిర్ణయాలను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.రమణేశ్వరి, డా.కె.సుబ్బారావు, ఆంధ్రవిశ్వవిద్యాలయ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్యులు విజయమోహన్, సూర్యనారాయణ డిగ్రీ కాలేజ్ అకాడమిక్ డైరెక్టర్ హబీబ్ బాషా, స్పోర్ట్సు బోర్డు సెక్రటరీ డా.బి.రామ్ గోపాల్, డా.ఎ.సత్యనారాయణ, ఎక్జిక్యూటీవ్ బాడీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

## క్రిస్మస్ తాత!!



పాశ్చాత్యులకు శాంటాక్లాజ్. ఈయన మూడవ శతాబ్దంలో పరిచయమయ్యాడు. డెన్మార్క్ లో సెయింట్ నికోలస్ అనే భక్తిపరుడైన కేథలిక్ బిషప్ ఉదంతమే శాంటాక్లాజ్ సృష్టికి మూలమని చెబుతారు. నికోలస్ నివసించిన ప్రాంతంలో ఒక పేదరైతు తన ముగ్గురు కుమార్తెలకు కట్నాలు ఇచ్చి పెళ్లిళ్లు చేయలేక ఇబ్బంది పడుతున్నప్పుడు నికోలస్ రాత్రి పూట బంగారు నాణాలు ఉన్న మూడు చిన్న మూటలను పైకప్పు నుంచి ఇంట్లోకి జారవిడుస్తాడు. అవి అక్కడ ఆరబెట్టి ఉన్న సాక్సుల్లో పడ్డాయట. అలా జరిగిన సాయం ఆ పేద రైతు కుటుంబంలో ఆనందాన్ని నింపింది. ఇలా లోకంలో మనసున్న మారాజులు రకరకాల సాయాలతో క్రిస్మస్ తాతలయ్యారు.

**డిసెంబర్ 25**

**క్రిస్మస్ శుభాకాంక్షలు!!**

– నన్నయవాణి

## లక్ష్య సాధనకు కృషి చేయండి

### ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌లో రిజిస్ట్రార్

**15.12.22 (మీడియాసెల్)**

వ్యసనాలకు దూరంగా ఉంటూ లక్ష్యాలను సాధించేందుకు ప్రతీ విద్యార్థి కృషి చేయాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ స్టూడెంట్ అఫైర్స్ ఆధ్వర్యంలో గురువారం యాంటీ ర్యాగింగ్, ఆల్కహాలిజం అండ్ డ్రగ్ అబ్యూస్ పై ఓరియంటేషన్ ప్రోగ్రామ్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, రాజమండ్రి అడిషనల్ ఎస్పీ లా అండ్ ఆర్డర్ ఎం.రజనీ ఐ.పి.ఎస్., గవర్నమెంట్ హాస్పటల్ న్యూరోసైక్యార్టిస్ట్ డాక్టర్ షేక్ కాజా మొహినుద్దీన్ ఎం.డి, విశ్వవిద్యాలయ అధికారులు హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ఓరియంటేషన్ ప్రోగ్రామ్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నూతనంగా ప్రవేశించిన విద్యార్థులకు స్వాగతం పలికారు. నన్నయ విశ్వవిద్యాలయం ర్యాగింగ్ ఫ్రీ క్యాంపస్ అని, ఇప్పటి వరకు ఒక్క ర్యాగింగ్ కేసు కూడా నమోదు కాలేదని ఈ వాతావరణాన్ని కొనసాగిస్తూ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను పూర్తి చేయాలని విద్యార్థులకు సూచించారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు విద్యార్థులకు అధిక ప్రాధన్యతనిస్తూ, విద్యార్థుల ఉన్నతిని ఆకాంక్షిస్తూ విశ్వవిద్యాలయాన్ని ముందుకు నడిపిస్తున్నారని తెలిపారు. విశ్వవిద్యాలయంలో ఉన్న అన్ని వనరులను, వసతులను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. విద్యతో పాటు లైబ్రరీ, క్రీడల్లోను, ఎన్.ఎస్.ఎస్ సేవా కార్యక్రమాల్లోను రాణిస్తూ ఉన్నత ఆలోచనలతో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. దుర్వ్యసనాలపై దృష్టిపెట్టకుండా లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. ఏఎస్పీ ఎం.రజనీ మాట్లాడుతూ తల్లిదండ్రుల కీర్తిప్రతిష్టలను పెంచే విధంగా విద్యార్థులను ఎదగాలని అన్నారు. మద్యపానం, డ్రగ్స్ జోలికి వెలితే జీవితం నాశనం అయిపోతుందని కుటుంబ పరువు పోతుందని తెలిపారు. ర్యాగింగ్ కు పాల్పడితే కఠినమైన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. యూనివర్సిటీలో ఏదైన సమస్య తలెత్తితే వెంటనే విశ్వవిద్యాలయ అధికారుల దృష్టికి తీసుకువెళ్ళాలని, వాటిపై తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. డాక్టర్ షేక్ కాజా మహినుద్దీన్ మాట్లాడుతూ విద్యార్థులు మానసిక స్థితిని మెరుగుపరచుకోవాలని తెలియజేసారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని, దానికి తగినట్టుగా సాధన చేసి లక్ష్యాలను అధిరోహించాలని అన్నారు. మద్యపానం, దూమపానం ద్వారా అనారోగ్యాలకు గురై మధ్యలోనే నిండు జీవితాలు కనుమరుగవుతున్నాయని హెచ్చరించారు. ఒక్కసారి డ్రగ్స్ కు అలవాటు అయితే బానిసను చేసి జీవితం చిద్రమవుతుందని చెప్పారు. ఫ్యాషన్ పేరుతో అలవాటుగా మారే అల్కహాల్, డ్రగ్స్ జీవితాన్ని సర్వనాశనం చేస్తాయని యువత వాటికి దూరంగా ఉండాలని సూచించారు. తరువాత యాంటీ ర్యాగింగ్, ఆల్కహాలిజం అండ్ డ్రగ్ అబ్యూస్ లకు సంబంధించిన బ్రోచర్ లను అతిథులు ఆవిష్కరించారు. అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేసారు. ముందుగా విశ్వవిద్యాలయ విద్యార్థులు ప్రదర్శించిన సందేశాత్మక నాటకం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, డీన్ స్టూడెంట్ ఆఫైర్స్ డా.ఎన్.ఉదయభాస్కర్, డీన్ అకడమిక్ ఆఫైర్స్ ఆచార్య పి.సురేష్ వర్మ, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.రమణేశ్వరి, డా.వి.పెర్సిస్, స్టూడెంట్ కోఆర్డినేటర్స్ డా.ఆర్.ఎస్. వరహాలదొర, డా.కీర్తిమరిట, డా.అఖిల, నీలిమ తదితరులు పాల్గొన్నారు.



యాంటీ ర్యాగింగ్ బ్రోచర్ ను ఆవిష్కరిస్తున్న అధికారులు

## సంపాదకీయం



# అక్షర క్రిస్మస్

బాధాతప్త హృదయాలకు బ్రతుకు మీద ఆశల్ని, భవిష్యత్తు మీద నమ్మకాన్ని కలిగించిన కరుణామయునికి కృతజ్ఞత క్రిస్మస్ పండుగ. అపారమైన కరుణ, క్షమాగుణం, అనిర్వచనీయమైన ప్రేమబంధం బైబిల్ కథల్లో నిక్షిప్తమై ఉన్నాయి. జీసస్ బోధనల్లో అంతర్లీనమైన విషయాలు ఆయన నడయాడిన ప్రాంతంలోని పాత్రలు ఎన్నో కథలుగా సంభాషణ రూపంలో, ప్రశ్న జవాబుల పద్ధతిలో మనకు తారసపడతాయి. ఏ దేశంలో ఏ మత గ్రంథాల్లోని సారమైనా కథల రూపంలో మనిషి అనువర్తింప చేసుకునేలా అందించబడ్డాయి. వాటి ద్వారానే మనిషి తనను తాను నిర్మించుకుంటాడు. ప్రతి మనిషికి తన ఆలోచనలే అతని ఆచరణలు. అవే చరిత్రలో మనిషి స్థానాన్ని నిర్ణయిస్తాయి.

సేవ, దాతృత్వం గురించిన కథలు బైబిల్ లో చాలా కనిపిస్తాయి. సేవా గుణం మనిషిలోని గొప్పతనమైతే కాదు. బాధ్యత! అది మనిషిగా కనీస బాధ్యత! సమాజమే పట్టనట్టు బతకడం కాదు. చెడు కనిపించగానే పారిపోవటమూ కాదు. ధైర్యంగా నిలబడటం, ఎదురొడ్డి పోరాడటం. సాహసికుల్నే భగవంతుడు ఇష్టపడతాడని బైబిల్ చెబుతోంది. గొప్ప గొప్ప పనులు చేయాలన్న ఆలోచనలే లేకపోతే మనిషికి తన మీద తనకున్న విశ్వాసంలోనే లోపం ఉన్నట్లని హెచ్చరించింది.

బలమైన సంకల్పాలు ప్రతికూలాల్ని అనుకూలంగా మార్చుకునే నైపుణ్యాలను పెంపొందించే కొన్ని సూచనలు చాలా కథల్లో కనిపిస్తాయి. నేహేమ్యా ఒక బానిస సంతానం. కానీ అంకిత భావంతో చక్రవర్తి అభిమానాన్ని పొంది పూర్వీకుల పట్టణంలో ప్రజల్ని సమైక్యపరచి తొంభై ఏళ్ల శిథిల ప్రాకారాన్ని యాభై రెండు రోజుల్లో పూర్తి చేసిన సందర్భంలో ఒక బానిస గొప్ప పునర్నిర్మాణానికి ఎంత సంకల్ప శక్తితో గొప్ప లక్ష్యాన్ని పూర్తి చేశాడో అవగతమవుతుంది.

తెలుసుకోవాలనే మనసు ఉండాలి కానీ ప్రపంచమే పెద్ద విశ్వవిద్యాలయం. మన ప్రకృతే మనకు గురువు. జ్ఞానమనే తలుపుల్ని మూసేసుకొని చీకట్లో బ్రతికేస్తూ వెలుతురు లేదని రోధిస్తే ఏం ప్రయోజనం. జీసస్ పదవ ప్రసంగంలో చెప్పిన కథలో రైతు చల్లిన విత్తనాలు రహదారి మీద, బండమీద, సారవంతమైన నేల మీద పడ్డాయి. రహదారి మీద బండమీద పడ్డవి పండవు కదా! వాటి వల్ల ఉపయోగం లేదు.నేల మీద పడ్డవి పంటనిచ్చినట్లుగానే మనం మంచినే నేరుగా హృదయం లోకి తీసుకోవాలని, అప్పుడే బ్రతుకులో సాఫల్యాల పంటలు పండుతాయనే సందేశాన్ని ఆ కథ మనకు అందిస్తుంది.

లక్ష్య శుద్ధి ఉన్నప్పుడు, ఆశయాలు బలమైనవైనప్పుడు వయసును అధిగమించవచ్చని, ప్రకృతిని లొంగదీసుకోవచ్చని సందేశాన్నిచ్చే కథలున్నాయి.ధార్మిక గ్రంథాలు ఇచ్చే సందేశాన్ని హృదయంలోకి తీసుకొని ఆచరణలో పెట్టినప్పుడు మాత్రమే శాంతి, సమాధానం, విజయం, సంతృప్తి వంటివి మన సొంతమవుతాయనేది గుర్తుపెట్టుకోవాల్సిన ముఖ్యమైన విషయం.

క్రిస్మస్ శుభాకాంక్షలు!!

# ఛాంబర్స్‌లో కెరీర్ గైడెన్స్‌సెల్ ప్రారంభించిన వీసీ

**13.12.22 (మీడియాసెల్)**

పాలకొల్లు లోని ఏ.ఎస్.ఎన్.ఎం ప్రభుత్వ కళాశాల మరియు బి.ఆర్.ఆర్ అండ్ జీ.కె.ఆర్ . ఛాంబర్స్ డిగ్రీ , పిజి కళాశాలను మంగళవారం వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు విజిట్ చేశారు. ఛాంబర్స్ కళాశాలలో కెరియర్ గైడెన్స్ సెల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నన్నయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ మొక్కా జగన్నాథరావు హాజరయ్యారు. ముందుగా విద్యార్థులకు వివిధపోటీపరీక్షలకు సన్నద్ధం అగుటకు ఏర్పాటుచేసిన కెరియర్ గైడెన్స్ సెల్ ను జగన్నాథరావు చేతులమీదుగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తనను తాను సెల్ఫ్ ఎవాల్యుయేషన్ చేసుకొనుటకు, సాధ్య ఆసాధ్యాలను అధిగమించడానికి ఒక ప్రణాళిక సిద్ధంచేసుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని, పోటీ ప్రపంచంలో వ్యక్తిత్వ లక్షణాలను తయారుచేసుకుని నిబద్ధతతో పనిచేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని విద్యార్థులకు సూచించారు. వివేకానందుని ఆశయాలను పాటిస్తూ వృత్తి నైపుణ్యాలను సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలని కళాశాల ఛైర్మన్, ప్రిన్సిపాల్, సెక్రటరీలు విద్యార్థులను ఉద్దేశిస్తూ ఉపన్యసించారు. ఈ సందర్భంగా జగన్నాథరావును కళాశాల ఛైర్మన్ కె.వి.ఆర్ . నరసింహారావు అభినందనలు తెలియజేసి జ్ఞాపికను అందజేసారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. డి. వెంకటేశ్వరరావు , సెక్రటరీ , ఛాంబర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ మెంబర్స్ , అధ్యాపకులు , విద్యార్థిని విద్యార్థులు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వీసీ జగన్నాథరావు గార్కి జ్ఞాపికను అందజేస్తున్న నరసింహారావు, తదితరులు

# నన్నయలో పైజోమీటర్లు (Piezometers) ప్రారంభించిన వీసీ

**16.12.22 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో తూర్పుగోదావరి జిల్లా భూగర్భ జల విభాగం వారు నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్ట్ క్రింద భూగర్భజలాలను అంచనా వేయడం కొరకు పైజోమీటర్లు ఏర్పాటు చేసారు. శుక్రవారం యూనివర్సిటీ సైన్స్ అండ్ టెక్నాలజీ భవన సమీపంలో ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు పీజోమీటర్లును ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా భూగర్భ జలవిభాగం వారు నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్ట్ క్రింద భూగర్భజలాలను అంచనా వేయదానికి రెండు పైజోమీటర్లు ఏర్పాటు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసాన్నారు. పైజోమీటర్లు ద్వారా విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని మరియు చుట్టుపక్కల గ్రామాల్లో భూగర్భ జలాలను అంచనా వేయడానికి ఉపయోగపడుతుంది. జియోసైన్సెస్ విద్యార్థులు పైజోమీటర్లు పనితీరు, భూగర్భ జలాల అంచనా వంటి పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని తెలియజేసారు. యూనివర్సిటీ జియోసైన్సెస్ విభాగం మరియు భూగర్భజల విభాగం వారికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసినందుకు సహకరించిన వారిని వీసీ అభినందించారు. డిప్యూటీ డైరెక్టర్ భూగర్భజల శాఖ వై.శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ఆచార్య కె.రమణేశ్వరి, కన్వీనర్ డా.కె.సూకరత్నం, డా.కె.వి.స్వామి తదితరులు పాల్గొన్నారు.



పైజోమీటర్లు ప్రారంభిస్తున్న వీసీ జగన్నాథరావు

# గూడెంలో నైతిక విలువలపై సెమినార్

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెం క్యాంపస్, ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 మరియు ఫార్మసీ విభాగ మహిళా సాధికారత క్లబ్ తో కలిసి 1948లో ఐక్యరాజ్యసమితి సాధారణ సభ ఆమోదించిన మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మానవ హక్కులు మరియు నైతిక విలువలపై ఒక రోజు సదస్సు నిర్వహించారు. అందరికీ గౌరవం, స్వేచ్ఛ మరియు న్యాయం.అనే థీమ్‌తో జరిగిన ఈ కార్యక్రమానికి తూర్పుగోదావరి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మాజీ ఛైర్‌పర్సన్ బి. పద్మావతి ప్రముఖ స్పీకర్‌గా పాల్గొన్నారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. శ్రీరమేష్ అధ్యక్షులుగా,కోఆర్డినేటర్ గా జె. కృష్ణంరాజు వహించారు. ఈ కార్యక్రమం కొరకు వివిధ డిపార్ట్‌మెంట్ కోర్స్ కోఆర్డినేటర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు మరియు విద్యార్థులు చురుకుగా పాల్గొని, మానవ హక్కులు మరియు ప్రాథమిక విధులకు సంబంధించి విద్యార్థులను చైతన్యపరిచారు.



# నన్నయ వీసీని కలిసిన సి.టి.ఆర్.ఐ. డైరెక్టర్



సి.టి.ఆర్.ఐ. డైరెక్టర్ ను సన్మానిస్తున్న వీసీ జగన్నాథరావు

**14.12.22 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావును సెంట్రల్ టోబాకో రిసెర్చ్ ఇన్సిట్యూట్ (సి.టి.ఆర్.ఐ) రాజమండ్రి డైరెక్టర్ ఎం.శేషుమాధవ్ మర్యాదపూర్వకంగా కలిసారు. బుధవారం యూనివర్సిటీ వీసీ కార్యాలయంలో వీసీ జగన్నాథరావును కలిసిన శేషుమాధవ్ సి.టి.ఆర్.ఐ., నన్నయ విశ్వవిద్యాలయాల అభివృద్ధికి సంబంధించిన పలు విషయాలను చర్చించారు. ఈ సందర్భంగా శేషుమాధవ్ మాట్లాడుతూ జాతీయ ఆర్థిక వ్యవస్థ మరియు ఉపాధి కల్పనలో పొగాకు పోషించే ముఖ్యమైన పాత్రను దృష్టిలో ఉంచుకుని భారత ప్రభుత్వం 1945లో ఇండియన్ సెంట్రల్ టొబాకో కమిటీ (ICTC)ని ఏర్పాటు చేసిందన్నారు. ICTC, మద్రాసు ఆధ్వర్యంలో రాజమండ్రిలో 1947లో సెంట్రల్ పొగాకు పరిశోధనా సంస్థ స్థాపించబడిందన్నారు. CTRIకి గుంటూరు, కందుకూరు, జీలుగుమిల్లి, హున్సూరు, వేదసందూర్, దిన్డటలో ఆరు ప్రాంతీయ పరిశోధనా కేంద్రాలు మరియు కలవచర్ల, కందుకూరులో ఉన్న రెండు కృషి విజ్ఞాన కేంద్రాలు ఉన్నాయన్నారు. సి.టి.ఆర్.ఐ. మరియు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మధ్య ఉన్న అవగాహన ఒప్పందాన్ని మరింత ముందుకు తీసుకువెళ్ళి కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. విశ్వవిద్యాలయంతో కలిసి పరిశోధనలు, ప్రోజెక్టులు, ఇంటర్న్ షిప్ లు, పరస్పర సహకారాలను గురించిన విషయాలను చర్చించారు. వీటిపై సానుకూలంగా స్పందించిన వీసీ జగన్నాథరావు విద్యార్థులకు ప్రయోజనకరమైన కార్యక్రమాలను, పరస్పర భాగస్వామ్య ప్రోజెక్టులను నిర్వహించవచ్చునని చెప్పారు. దీనికి సంబంధించిన ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. తరువాత శేషుమాధవ్ ను వీసీ జగన్నాథరావు సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సి.టి.ఆర్.ఐ. ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డా.కె.సరళ, విశ్వవిద్యాలయ అధికారులు ఆచార్య పి.సురేష్ వర్మ, ఆచార్య కె.రమణేశ్వరి, డా.ఎ.మట్టారెడ్డి, డా.డి.కళ్యాణి, డా.పి.విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్మస్ ట్రీ



క్రిస్మస్ ట్రీ సంప్రదాయం మధ్యయుగంలో జర్మనీలో ప్రారంభమైందని చెబుతారు. 18వ శతాబ్దంలో విక్టోరియా రాణి తన రాజభవనంలో క్రిస్మస్ చెట్టును ఏర్పాటు చేయడంతో అది అత్యధికంగా ప్రాచుర్యం పొంది వ్యాప్తి చెందింది. ఆ చెట్టును దీపాలతో అలంకరించింది సంస్కరణోద్యమ పితామహుడైన మార్టిన్ లూథరట. ఏది ఏమైనా చెట్టు ఆనందానికి, సిరి సంపదలకు చిహ్నంగా ప్రపంచంలోని అన్ని నాగరికతలు గుర్తించాయి. ఆ క్రమంలో అది క్రిస్మస్ అలంకరణలో భాగమైంది.దానికి కొన్ని పండ్లను కూడా అలంకరించడం సంప్రదాయం వచ్చింది. చెట్టుకి ఇవ్వటమే తెలుసు. అది పరోపకారానికి చిహ్నం.ఇవ్వటం, ప్రేమించటం, క్షమించటం ప్రధాన అంశాలైన క్రిస్మస్ రోజున క్రిస్మస్ ట్రీ పరోపకారానికి చిహ్నంగా నిలిచింది.

# 20న ఎంబీఏ, ఎంసిఏలకు స్పాట్ కౌన్సెలింగ్

**16.12.22 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఎంబీఏ, ఎంబీఏ టూరిజం అండ్ హాస్పటాలిటీ మరియు ఎంసిఏ కోర్సులకు ఈ నెల 20వ తేదీన స్పాట్ అడ్మిషన్ల కౌన్సెలింగ్ ను నిర్వహిస్తున్నామని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు తెలిపారు. యూనివర్సిటీలో శుక్రవారం స్పాట్ కౌన్సెలింగ్ కు సంబంధించి ప్రకటనను వీసీ విడుదల చేసి వివరాలను తెలియజేసారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాలలో ఎంబీఏ, ఎంబీఏ టూరిజం అండ్ హాస్పటాలిటీ మరియు ఎంసిఏ కోర్సులకు స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్లు నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 20వ తేదీన రాజమహేంద్రవరం యూనివర్సిటీ క్యాంపస్ కన్వెన్షన్ సెంటర్ లో స్పాట్ కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. ఐసెట్ - 2022 ర్యాంకర్లు స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ కు అర్హులని తెలిపారు. రెగ్యూలర్ సీట్లుతో పాటు సెల్ఫ్ సపోర్టు సీట్లును కూడా స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ లో భర్తీ చేస్తారని చెప్పారు. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు సర్టిఫికెట్టులు, ఫీజులతో హాజరై డైరెక్టరెట్ ఆఫ్ అడ్మిషన్స్ ను సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 0883-2566011 / 7093008477 లేదా యూనివర్సిటీ వెబ్ సైట్ ద్వారా సంప్రదించాలని సూచించారు.

# కాకినాడ క్యాంపస్‌లో గణిత పోటీలు



కాకినాడ క్యాంపస్ లో పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

డిసెంబర్ 22, గణిత దినోత్సవం సందర్భంగా కాకినాడ ఎం.ఎస్.ఎన్ పి. జి. క్యాంపస్ లో క్విజ్, పోస్టర్ ప్రెజెంటేషన్ మరియు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు ప్రగతి కళాశాల, ఐడియల్ కళాశాల, ఎం.ఎస్.ఎన్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. ఎం. కమలకుమారి మాట్లాడుతూ గణితం ప్రాధాన్యం వివరించేందుకే ప్రభుత్వం రామానుజన్ జయంతిని ఘనంగా జరుపుతుందని పేర్కొన్నారు. క్విజ్ పోటీలకు, పోస్టర్ ప్రెజెంటేషన్ మరియు వ్యాస రచన పోటీలకు అధ్యాపకులు డా. ఎం. శ్రీదేవి, డా. ఇ. అప్పారావు, శ్రీనివాసరావు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఎం.పోచయ్య ఇంగ్లిష్ సహాయ ఆచార్యులు, ఎ.సిహెచ్ .స్రవంతి , జి.దుర్గా భవాని ,మాథమాటిక్స్ సహాయ ఆచార్యులు పాల్గొన్నారు. రెండవ సంవత్సరం గణిత విద్యార్థులు ఉత్సాహంగా పోటీలు నిర్వహించారు.

# గూడెం క్యాంపస్ విద్యార్థుల ప్రతిభ



ఆదికవి నన్నయ ఫార్మసీ విభాగం విద్యార్థులు 8, 9, 10 తేదీల్లో భీమవరం విష్ణు ఫార్మసీ కళాశాల 25 సంవత్సరాల జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నన్నయ విద్యార్థులు హాజరై వైజ్ఞానిక సదస్సులు, క్విజ్, సాహిత్య, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. క్రీడలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలకు బహుమతులు పొందారు. బి ఫార్మసీ ఫైనల్ ఇయర్ విద్యార్థిని కె. ప్రియాంక రెడ్డి శాస్త్రీయ నృత్యంలో ద్వితీయ బహుమతి, 400 మీటర్ల పరుగు పోటీలో తృతీయ సంవత్సరం విద్యార్థి ఎం. హరి ప్రసాద్ తృతీయ బహుమతి సాధించారు. బహుమతులు సాధించిన విద్యార్థులను నన్నయ క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. శ్రీరమేష్, ఫార్మసీ కోర్స్ కోఆర్డినేటర్ డా. హీరా బట్టు మరియు ఫార్మసీ టీచింగ్ స్టాఫ్ సిబ్బంది అభినందించారు.

# గిరిజన ప్రోజెక్టులో ఆచార్య ఎస్.టేకి

**12.12.22 (మీడియాసెల్)** గిరిజనుల జీవనోపాధికి పర్యావరణం – స్నేహపూర్వక సాంకేతికతలు మరియు మైక్రో ఫైనాన్స్ పాత్రకు సంబంధించిన రిసెర్చ్ ప్రోజెక్టుకు డైరెక్టర్ గా వ్యవహరిస్తున్న ఆచార్య ఎస్.టేకి ఈ నెల 10,11 తేదీలలో పాడేరు గిరిజన ప్రాంతాలలో పర్యటించి పలు పరిశోధన విషయాలను తెలియజేసారు. ఇండియన్ కౌన్సిల్ ఫర్ సోషల్ సైన్సెస్ రిసెర్చ్ (ఐ.సి.ఎస్.ఎస్.ఆర్) న్యూఢిల్లీ వారి సహకారంతో గిరిజనుల జీవనోపాధికి పర్యావరణం – స్నేహపూర్వక సాంకేతికతలు మరియు మైక్రో ఫైనాన్స్ పాత్రకు సంబంధించిన రిసెర్చ్ ప్రోజెక్టుపై పని చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా పాడేరు, మాడుగుల వంటి ప్రాంతాలలో పర్యటించి లఘు అటవీ ఉత్పత్తులైన విప్పపువ్వ, విస్తరాకులు, తేనె, చింతపండు, ఉసిరికాయలు, ఔషధ మొక్కలు వంటివి ప్రోసెస్ చేసే



గిరిజన ప్రాంతాలలో పర్యటిస్తున్న ఆచార్య ఎస్.టేకి

విధానం, ఆదాయ పెంపు మార్గాలను అధ్యయనం చేసామన్నారు. బ్యాంకుల ద్వారా లఘు వ్యాపారాలకు సంబంధించిన రుణాలను పొందే మార్గాలను సూచించామన్నారు. గిరిజనల ఉత్పత్తులకు సంబంధించి ఎదురవుతున్న సవాళ్ళను, పరిష్కార మార్గాలను ప్రోజెక్టు ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. గిరిజన జీవనోపాధి మెరుగుపరచేందుకు చేపట్టిన 9 నెలల ప్రోజెక్టులో భాగంగా త్వరలో ఛతీస్ఘడ్ గుజరాత్ ప్రాంతాలలో పర్యటిస్తామన్నారు. పరిశోధన ప్రోజెక్టు సహకరిస్తున్న ఐ.సి.ఎస్.ఎస్.ఆర్ వారికి, వీసీ జగన్నాథరావుకు కృతజ్ఞతలను తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.రాజేంద్రప్రసాద్, డా.లక్ష్మీనారాయణ, డా.శ్రీరామరాజు, డా.మధు, డా.అనిత పాల్గొన్నారు.

# జిల్లా యూత్ ఫెస్టివల్‌లో నన్నయకు ప్రథమ స్థానం


**16.12.22 (మీడియాసెల్)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ, డిపార్టమెంట్ ఆఫ్ యూత్ సర్వీస్ వారు ఇటీవల నిర్వహించిన డిస్ట్రిక్ట్ యూత్ ఫెస్టివల్ – 2022 నాటక పోటీలలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి నాటకానికి ప్రథమ స్థానం దక్కిందని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు తెలిపారు. విశ్వవిద్యాలయంలో వీసీ జగన్నాథరావు చేతుల మీదుగా విద్యార్థులు జ్ఞాపికను, సర్టిఫికెట్టులను అందుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎకనామిక్స్ విభాగ విద్యార్థి జి.శివప్రసాద్ గ్రూప్ ప్రదర్శించిన దేశభక్తి నాటకానికి ప్రథమ స్థానం దక్కిందని, అలాగే ఫ్యాన్సీ డ్రెస్ పోటీలలో జియోఫిజిక్స్



విద్యార్థులకు సర్టిఫికెట్స్ ను అందజేస్తున్న వీసీ

విద్యార్థి తోట భారతీదేవి తృతీయ స్థానం సాధించారన్నారు. దేశభక్తి నాటకంలో ప్రథమ స్థానం సాధించిన జి.శివప్రసాద్, ఎన్.వెంకట్, పి.రాజేష్, ఎస్.ప్రసాద్, డి.సతీష్, బి.అశోక్, పి.వసంత, మహ్మద్ కుబ్ర, జె.స్వప్న, ఎల్. ప్రసాద్ లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. కె.ఎల్. యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో నన్నయ విశ్వవిద్యాలయ విద్యార్థులు ప్రతిభను కనపరచాలని శుభాకాంక్షలను తెలియజేసారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా.కె.రాజరాజేశ్వరిదేవి, డా.టి.అనిత తదితరులు పాల్గొన్నారు.

## చెట్టునుచూసి నేర్చుకుందాం!!



చిమ్మచీకట్లో,జడివానలో
ఆగలేక కొట్టిన గాలి వేగానికి
చెట్టు ఆకులన్నీ రాలిపోయాయి కానీ.. ఆ చెట్టు మాత్రం తన సహనాన్ని ఏమాత్రం కోల్పోకుండా నిటారుగా నిలబడింది.
అది చెట్టు గొప్పతనమా..?
నేలలో బలంగా ప్రాకిన వేర్ల గొప్పతనమా..?
నేల గొప్పతనమా.?
రాలిన ఆకులు నీళ్లలో కొట్టుకుపోయాయి.
కొన్ని ఆకులు భూమిలో కలిసిపోయాయి.
రాలినవన్నీ భూమికి ఎరువయ్యాయి.
రాలిన గింజలు కొత్త ఆశలతో మళ్లీ మొలకెత్తుతాయి.
చెట్టుకొమ్మలు కొత్త చిగుళ్ళతో అందంగా ముస్తాబై..
విరబూసిన పువ్వులకు జన్మనిస్తాయి.
మనకు ప్రాణవాయువును,ఆహారాన్ని ఎంతో ఆనందంగా ఇస్తాయి.
చెట్టు ఇంత చేసినప్పుడు..
మనిషిగా మనం ఎంత చేయాలి..? ఎన్ని కష్టాలు ఎదురైనా..సహనంతో, దృఢ సంకల్పంతో ధైర్యంగా నిలబడి పోరాడే శక్తిని చెట్టు మనకిస్తోంది.

**- బి.సుశాంత్ కుమార్**

# నన్నయ ఇంజనీరింగ్ విద్యార్థుల అకాడమిక్ విజిట్




**14.12.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఈ.సీ.ఈ, ఈ.ఐ.ఈ విద్యార్థులు ఎన్.ఐ.టి. తాడేపల్లిగూడెం ను బుధవారం విజిట్ చేసారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్ విజిట్ ను ప్రారంభించి వివరాలను తెలియజేసారు. ఇంజనీరింగ్ విద్యార్థుల అకడమిక్ విజిట్ లో భాగంగా ఎన్.ఐ.టి తాడేపల్లిగూడెంను సందర్శిస్తారని చెప్పారు. ఎన్.ఐ.టి తాడేపల్లిగూడెం, డా.వై.ఎస్.ఆర్.హార్టికల్చర్ యూనివర్సిటీ, జె.ఎన్.టి.యు.కె మరియు నన్నయ విశ్వవిద్యాలయాలు క్లస్టర్ యూనివర్సిటీగా పని చేస్తున్నాయన్నారు. క్లస్టర్ యూనివర్సిటీ కోఆర్డినేటర్ గా నన్నయ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు వ్యవహరిస్తూ పలు కార్యక్రమాలను చేపట్టి ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. దీనిలో భాగంగా ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇంజనీరింగ్ విద్యార్థులు ఎన్.ఐ.టి. కి అకడమిక్ విజిట్‌కు వెళ్ళారని తెలిపారు. ఎన్.ఐ.టి. ఆంధ్రప్రదేశ్ స్థానికంగా ఎంతో అభివృద్ధిని సాధించిందని ల్యాబ్స్, వనరులు, వసతులను విద్యార్థులు పరిశీలించారని చెప్పారు. ఎన్.ఐ.టి. అధ్యాపకులతో ఇంట్రాక్షన్ సెషన్ జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధ్యాపకులు బి.సుధాకిరణ్, జె.హనుమంతు, పి.వెంకటరత్నం, డా.శ్రీనివాసరావు, బి.యానికెజియా, ఎన్.సంతోషి విద్యార్థులు పాల్గొన్నారు.




## మంచిమాట

**What I have Known with respect to myself, h tendered much to lessen my admiration and my contempt of others.**

**నన్ను నేను తెలుసుకోగలిగిన తర్వాత ఆత్మస్తుతి, పరనింద మానుకున్నాను.**

**- జోసెఫ్ ప్రీస్ట్లీ**



ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in